



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, కృష్ణభారతి చిత్రపటం వద్ద కలెక్టర్ నాగరాణి నివాళి

జన్మతః దేశభక్తురాలు

కృష్ణభారతికి మంత్రి నిమ్మల నివాళి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లి గర్భంలో ఉండగానే పసల కృష్ణభారతి స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామి అయ్యారని, జైల్లోనే పుట్టడం ద్వారా జన్మతః దేశభక్తురాలు అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమర యోధురాలు, గాంధేయవాది పసల కృష్ణభారతి సంస్మరణ సభ ఆదివారం తాడేపల్లిగూడెంలో కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద గాంధేయవాదులు, నాయకులు, అధికారులు నివాళులర్పించారు. సభలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న సందర్భంలో పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతులు చెరశాలలో ఉన్నప్పుడు జన్మించిన కృష్ణ భారతి గాంధేయవాదిగా, సంఘసంస్కర్తగా, ఆధ్యాత్మికవేత్తగా ఆదర్శ జీవితం సాగించారని కొనియాడారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పసల కృష్ణమూర్తి కుటుంబ చరిత్ర తెలుసుకుంటుంటే రోమాలు నిక్కబొడుచుకుంటాయన్నారు. కృష్ణభారతి నిరాడంబర జీవితం గడిపిన ఆదర్శమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి రాజమౌళి, మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమసుందర్, బుద్దాల రామారావు, భోగిరెడ్డి ఆదిలక్ష్మి తదితరులు కృష్ణభారతి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.

ఆక్వా రైతులకు ప్రభుత్వం అండ

- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు
- ఉండిలో ఉమ్మడి జిల్లా ఆక్వా రైతుల సదస్సు

ఉండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆంక్షలతో ఆక్వా రైతులు ఆందోళన చెందనవసరం లేదని, మన ప్రాంత ఆక్వా ఉత్పత్తులకు ప్రపంచ దేశాల్లో డిమాండ్ ఉందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఉండిలో ఆదివారం జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆక్వా కల్చర్ సుస్థిరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో చర్యలు చేపడతామని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మనదేశంలో ఆక్వా రైతులు పండించిన రొయ్యలు ఏదేశంవారికైనా అవసరమేనన్నారు. ఎన్నో దేశాలు మన రైతులు పండించిన రొయ్యలు కావాలని ఎగబడుతున్నారన్నారు. పంట పండినప్పుడు రొయ్యల ధర తగ్గుతుందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్ట వలసివుందన్నారు. తాను సీఎం దృష్టికి తీసుకుని వెళతానని ఆయన తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో రు.80లక్షలతో ఆక్వా లేబొరేటరీని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఉండి కేవీకేలో ఆక్వా ల్యాబ్‌ను ఆధునీకరిస్తామన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు మంచి రోజులు రానున్నాయన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆక్వా రైతుల సదస్సులో వచ్చిన సమస్యలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతానని తెలిపారు. ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఆక్వా రైతుల సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మాట్లాడుతూ అధునాతన ఆక్వా ల్యాబ్‌లు రావాలన్నారు. ప్రస్తుతం రైతుల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం వచ్చిందని, సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సదస్సులో ఆక్వా రైతులు గాదిరాజు సుబ్బరాజు, వేగేశ్న సత్యనారాయణరాజు, నంబూరి గజపతిరాజు, తాడినాడ బాబు, గాంధీభగవన్‌రాజు, తులసీ రాంబాబు, కునాధరాజు మురళీకృష్ణంరాజు, ముత్యాల రత్నం, రుద్రరాజు యువరాజు, మత్స్యశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, వేదికపై ఎంపీ బీద మస్తాన్‌రావు, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, కలెక్టర్ నాగరాణి

మందు బాబులకు పర్మిట్ రూమ్





మందు బాబులకు మందు తాగడమే పెద్ద సమస్య. వైన్ షాపులో దర్జాగా కొనుగోలు చేస్తారు. అక్కడ తాగడానికి నిబంధనలు అడ్డం. రోడ్డు పక్కనో.. చేల వద్దనో తాగుదామంటే బహిరంగ మద్యపానం నేరం. మందు బాబులకు ఇక ఇలాంటి అవస్థలు ఉండవు. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లో దర్జాగా పెగ్ బిగించవచ్చు. ప్రభుత్వ అనుమతితో పర్మిట్ రూమ్‌లకు రంగం సిద్ధమైంది. త్వరలో అందుబాటులోకి రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

- రోడ్డుపైన.. ఇళ్లు.. చేల వద్ద మద్యపానం
- స్థానికులు, అధికారుల నుంచి అభ్యంతరం
- మందుబాబుల అవస్థలు
- ముందుగా గ్రామాల్లో సిట్టింగ్ రూమ్
- తర్వాత పట్టణాల్లో ఏర్పాటు

భీమవరం క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు లేకపోవడం వల్ల మందుబాబులు ఇబ్బందులు పడుతున్నారు. మద్యం కొనుగోలు చేసి రోడ్డు పక్కన, పంట పొలాలు, నివాసాల మధ్యలో సేవిస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేయడం సర్వసాధారణంగా మారింది. కొన్ని మద్యం దుకాణాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తున్నా మందు బాబులకు ఇబ్బందులు తప్పడం లేదు. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. గత ప్రభుత్వం కూడా సిటింగ్ రూమ్‌లు లేకపోవడం, నాసిరకం మద్యం విక్రయాలతో చాలా మంది అనారోగ్యం పాలయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్వాలిటీ మద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికీ సిటింగ్ రూమ్‌లు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని మందుబాబులు వాపోతున్నారు. సిటింగ్ రూమ్‌లు లేకపోవడంతో మద్యం కొనుగోళ్లపైనా ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందని అధికారులు చెబుతున్నారు. సిటింగ్ రూమ్‌లు ఇస్తే మద్యం అమ్మకాలు ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని కూడా చెబుతున్నారు.

జిల్లాలో 193 మద్యం దుకాణాలు

జిల్లాలో 193 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. వేలం ద్వారా మద్యం దుకాణాల లైసెన్స్‌లు కేటాయించారు. అప్పట్లోనే సిట్టింగ్ రూమ్‌లకు పర్మిషన్ ఇచ్చి ఉంటే జిల్లాలో సుమారు రూ.10 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని తెలుస్తుంది. దుకాణానికి వచ్చి సిటింగ్ రూమ్‌ల ఏర్పాటుకు రూ.5 లక్షలు ధరగా గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. కానీ సిటింగ్ రూమ్‌లు ఇవ్వడానికి సంశయించారు. కానీ మందుబాబుల్లో వ్యతిరేకతతోపాటు మద్యం అమ్మకాలు మందకొడిగా సాగడంతో గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. కొద్దిరోజుల్లోనే సిటింగ్ రూమ్‌ల ఏర్పాటుకు ప్రయత్నాలు శరవేగంగా సాగుతున్నాయి.

బార్ యజమానుల వ్యతిరేకత

మద్యం దుకాణాల వద్ద సిటింగ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తే బార్‌కు వచ్చేవారి సంఖ్య తగ్గుతుందని బార్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల్లో ధర తక్కువ ఉండడంతోపాటు తినుబండారాలు అందుబాటులో ఉండడం వల్ల బార్ల వైపు ఎవరూ చూడరని చెబుతున్నారు. బార్‌లలో క్వార్టర్‌కు రూ. 30 నుండి రూ. 50 వరకు అదనంగా వసూలు చేయడం వల్ల మందుబాబులు ఎక్కువ శాతం మద్యం దుకాణాల వైపే చూస్తారని చెబుతున్నారు. కొద్ది రోజుల్లో బార్‌ల లైసెన్స్‌లు గడువు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బార్‌ల లైసెన్స్‌ల ఫీజులు తగ్గించి వారికి న్యాయం చేసే అవకాశం ఉంటుందన్న ఆశాభావం కూడా వ్యక్తమవుతుంది.

ముందుగా గ్రామాల్లో అనుమతి..

బార్‌ల నిర్వాహకుల సమస్యను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందుగా గ్రామీణ ప్రాంత మద్యం దుకాణాలకు సిటింగ్ రూమ్ అనుమతి ఇవ్వనున్నట్లు సమాచారం. కొంత కాలం అనంతరం పట్టణాలకు కూడా సిటింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. సిటింగ్ రూమ్‌ల ఏర్పాటుకు అన్ని దుకాణాలకు ఒకేవిధంగా రూ.5 లక్షలు చొప్పున లైసెన్స్ ఫీజు ఉంటుందా.. లేక గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు వేర్వేరు ఫీజులు ఉంటాయా అనే స్పష్టత లేదు. సిటింగ్ రూమ్‌ల ఏర్పాటు కోసం కసరత్తు ప్రారంభమైందనే తెలుస్తుంది.

వరుస సెలవులతో జాప్యం



వరుస సెలవుల వల్ల పర్మిట్ రూమ్‌ల ఏర్పాటు ఆలస్యమైంది. వారం రోజుల్లో సిటింగ్ రూమ్‌ల ఏర్పాటుకు ఉత్తర్వులు రానున్నాయి. గతంలో ఈ ప్రతిపాదన ఉన్నప్పటికీ మంత్రివర్గం నిర్ణయాల వల్ల ఏర్పాటు ఆలస్యమైంది. సిటింగ్ రూమ్‌లు లేకపోవడం వల్ల మద్యం సేవించేవారు ఎక్కడబడితే అక్కడ సేవించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవారు. ఆ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం త్వరలోనే సిటింగ్ రూమ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది.

ఆర్ఎస్ కుమరేశన్, జిల్లా ఎక్సైజ్ అధికారి



తాడేపల్లిగూడెం పట్టణంలో వర్షం

గాలి.. వాన..

తడిచిన ధాన్యం రాశులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పలుచోట్ల ఆదివారం రాత్రి వర్షం కురిసింది. రాత్రి సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాడేపల్లిగూడెం మండలంలో ధాన్యం రాశులు ముద్దయ్యాయి. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. తాడేపల్లిగూడెం, భీమవరం, గణపవరం, తణుకు, ఉండి, పెనుమంట్ర, పాలకొల్లు, నరసాపురం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

కైకలూరు రైల్వేస్టేషన్‌లో చెట్టు విరిగి పడడంతో ఆదివారం రాత్రి 8:45 గంటలకు తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ మూడు గంటల పాటు నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో రెండో ప్లాట్‌ఫామ్‌పై నరసాపూర్ నుంచి చర్లపల్లి వెళ్లే స్పెషల్ ట్రైన్ కూడా నిలిచిపోయింది. ఎవరికి ప్రమాదం జరగకపోవడం అంతా ఊపిరి పీల్చుకున్నారు.



ముత్యాలపల్లి వద్ద రాలిన మామిడి



గోనె సంచులకు బిల్లులు ఉన్నాయా?

- రైతులను ఆరా తీసిన వ్యవసాయ శాఖాధికారి
- రైతుల అభ్యంతరం

తణుకు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గోనె సంచులు ఎక్కడ కొనుగోలు చేశారు? బిల్లులు ఉన్నాయా? అని అధికారులు ప్రశ్నించడంతో రైతులు అవాక్కయ్యారు. గత ఏడాది రబీ సీజన్‌లో వాతావరణ మార్పుల నేపథ్యంలో ధాన్యం కొనుగోలులో గోనె సంచుల కొరత ఏర్పడింది. రైతులు స్వయంగా గోనె సంచులను ఏర్పాటు చేసుకుంటే మిల్లులకు ధాన్యం చేరగానే తిరిగి రైతులకు అందజేస్తామని అప్పటి వ్యవసాయాధికారులు తెలిపారు. దీనితో పలువురు రైతుల అందుబాటులో ఉన్న సంచులతో ధాన్యాన్ని మిల్లులకు హడావుడిగా తరలించారు. అప్పట్లో తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామం సొసైటీ ద్వారా పరిసర రైతులు 5వేల గోనె సంచులను అధికారులకు అందించారు. జిల్లా మొత్తం మీద సుమారు లక్ష గోనె సంచులను సేకరించినట్లు సమాచారం. రైతుల నుంచి సేకరించిన గోనె సంచుల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని అంచనా. ఏడాది గడిచినా సంచులు తిరిగి తమకు అందలేదని రైతులు వాపోతున్నారు. వాతావరణ మార్పులతో 'రైతులు బిక్కుబిక్కు' శీర్షికన ఈ నెల 10న ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనంలో గోనె సంచుల సమస్య వెలుగులోకి తెచ్చింది. దీనితో మండపాక గ్రామానికి చెందిన రైతులను వ్యవసాయ శాఖ అధికారులు కలిసి బిల్లులు ఉన్నాయా అంటూ ఆరా తీశారు.

ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారిని వివరణ కోరగా గోనె సంచులతో తమ శాఖకు సంబంధం లేదన్నారు. మండల వ్యవసాయాధికారి రైతుల వద్దకు వెళ్లి బిల్లులు, రసీదులు అడుగుతున్నారు. గత రబీ సీజన్‌లో రైతుల గోనె సంచులకు సంబంధించి బిల్లులు కానీ, రైతుల నుంచి గోనె సంచులను సేకరించినట్లు రసీదులు గానీ తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు అడిగారని తణుకు మండల వ్యవసాయాధికారి కె.కుసుమ తెలిపారు. దీనితో తాము రైతులను కలిసి ఆరా తీసినట్లు ఆమె వివరించారు.

గోనె సంచులు తిరిగి ఇవ్వాల్సిందే



గత ఏడాది రబీ సీజన్‌లో వర్షాల నేపథ్యంలో తక్షణం ధాన్యం తరలించేందుకు అనువుగా ఒక్క దువ్వ సొసైటీ పరిధిలోనే రైతుల నుంచి 5 వేల గోనె సంచులను తీసుకున్నారు. జిల్లా మొత్తం మీద సుమారు లక్ష గోనె సంచులను రైతుల నుంచి తీసుకున్నట్లు తెలిసింది. రైతుల నుంచి తీసుకున్న గోనె సంచులను రైతులకు తిరిగి ఇవ్వాల్సిందే.

చుండ్రు రామ్మోహనరావు, రైతు, మండపాక

చేపల వేట నిషేధం



బోటు యజమానులకు నోటీసులు ఇస్తున్న మత్స్యశాఖ అధికారులు

- జూన్ 15 వరకు అమలు
- మత్స్యకారులకు నెలకు రూ.10 వేల భృతి

నరసాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేట నిషేధిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు సోమవారం అర్ధరాత్రి నుంచి అమలోకి రానున్నాయి. జూన్ 15 వరకు అంటే 60 రోజులు పాటు చేపల వేట నిషేధం అమలులో ఉంటుందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. బోటు నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. వేటకు వెళ్లిన బోట్లన్ని తీరానికి చేరుకుంటున్నాయి. సముద్రంలో ఉన్న బోట్లకు అంతర్వేది లైట్ హౌస్ నుంచి వైర్‌లైస్ సెట్‌ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. 60 రోజల పాటు 1780 మంది మత్స్యకారులకు ఉపాధి ఉండదు. ఐస్ ఫ్యాక్టరీ, మత్స్య ఎగుమతి కంపెనీ కార్మికులు, లారీ డ్రైవర్లు కూడా తాత్కాలికంగా ఉపాధి కోల్పోనున్నారు.

పునరుత్పత్తిని పరిరక్షించేందుకు

ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు దేశవ్యాప్తంగా సముద్ర వేటను కేంద్ర ప్రభుత్వం నిలిపివేస్తుంది. ఈ రెండు నెలల కాలంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరుగుతుంది. ఈ సమయంలో వేట సాగిస్తే మత్స్య సంపద హరించిపోతుందని, ముందస్తు జాగ్రత్తతో వేట నిలిపివేస్తారు. జిల్లాలో నరసా పురం, మొగల్తూరు మండలంలో సముద్ర తీరం విస్తరించి ఉన్న 19 కిలోమీటర్ల పరిధిలో నిషేధ ఆజ్ఞలు అమలోకి వస్తున్నాయి.

1770 మందికి భృతి

నిషేధ కాలంలో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు ప్రభుత్వం నెలకు రూ 10 వేలు భృతి అందించనుంది. జిల్లాలో ప్రస్తుతం 1780 మంది గుర్తింపు పొందిన మత్స్యకారులు ఉన్నారు. మే, జూన్ భృతి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్నాయి. గత ఏడాది వరకు నిషేధ సమయంలో కేవలం రూ.10వేలు అందేది. కూటమి ప్రభుత్వం రూ.20వేలకు పెంచారు.



తాడేపల్లిగూడెంలో బుక్ డిపో వద్ద దింపుతున్న పాఠ్య పుస్తకాలు

బడి పిల్లలకు పుస్తకాల బరువు తగ్గింది

53 టైటిల్స్ తగ్గిస్తూ కొత్త పుస్తకాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి సర్కార్ బడి పిల్లలకు పుస్తకాల బరువు తగ్గించారు. గతంలో ఉన్న పుస్తకాలను తగ్గిస్తూ కొత్త పుస్తకాలను అందించేందుకు రంగం సిద్ధం చేశారు. గతంలో 1 నుంచి 9వ తరగతి వరకూ 223 టైటిల్స్ ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం ఆ సంఖ్యను 170కి కుదించింది. 53 టైటిల్స్ కుదింపునకు గురయ్యాయి. దీంతోపాటు ఆ పుస్తకాలు రెండు సెమిస్టర్స్‌గా భాగించి విద్యార్థులు ఏడాదికి సరిపడా పుస్తకాలన్నింటిని మొదటి రోజునుంచే మోసుకెళ్లే అవసరం లేకుండా చూస్తోంది. పాత పుస్తకాలు ఈ విద్యా సంవత్సరం నుంచి పనికి రావని అధికారులు చెబుతున్నారు. జిల్లా పాఠ్య పుస్తకాల విక్రయ కార్యాలయానికి మూడో వంతు పుస్తకాలు చేరగా నెలాఖరుకు నూరుశాతం పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరవేసేందుకు అధికారులు ప్రణాళికలు వేశారు.

జిల్లాకు 4.50 లక్షల పుస్తకాలు..

ఉమ్మడి పశ్చిమ జిల్లాకు 12,44,864 పుస్తకాలు అందించాల్సి ఉండగా ఇప్పటికే జిల్లాకు 4,46,911 పుస్తకాలు చేరాయి. మరో పది రోజుల్లో నూరుశాతం పుస్తకాలు చేరేవిధంగా ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలా కాకుండా పుస్తకాలు బరువు తగ్గించి పిల్లలకు ఇబ్బంది లేకుండా చేయాలనే ఉద్దేశంతో మార్పులు చేపట్టారు.

సిలబస్ ఒకటే.. పుస్తకాల మార్పు..

గతంలో మాదిరిగానే సిలబస్ ఉంటుంది కానీ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పుస్తకాలను సిద్ధం చేశారు. ఈ పుస్తకాలు అంతా ఆధునీకరించిన టైటిల్స్‌తో విద్యార్థులకు నూతనంగా అందించేవిధంగా తీర్చిదిద్దారు. ఒకటో తరగతి విద్యార్థులకు తెలుగు లెక్కలు, ఇంగ్లీష్ ఒకటేపుస్తకం కేటాయించారు. దీంతో ఒకే పుస్తకంలో తెలుగు, ఇంగ్లీష్ లెక్కలు చదువుకునే వీలుంటుంది. దీంతో విద్యార్థులకు రెండు పుస్తకాలతోనే చదువుకోవచ్చు.

బుక్ డిపో ద్వారానే..

పాఠ్యపుస్తకాలు గతంలో 1 నుంచి 7వ తరగతి వరకూ జిల్లా బుక్ డిపో నుంచి అందించగా 8,9,10 తరగతులకు ఎంఈవోల నుంచి నేరుగా పాఠశాలలకు అందించేవారు. తాజాగా 1 నుంచి 10వ తరగతి వరకూ బుక్ డిపోల నుంచే పాఠశాలలకు అందించే ఏర్పాట్లు చేసినట్లు బుక్ డిపో మేనేజర్ టి.భాస్కరరావు తెలిపారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

భీమవరం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు డివిజన్, మండల స్థాయి కార్యక్రమాలను రద్దుచేసామని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు


భీమవరంటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు కు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 24 నుంచి వచ్చే నెల 10 వరకు దరఖాస్తు నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థి వయస్సు 21 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి. కుల, ఉప కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు నకళ్లతో దరఖాస్తు చేయాలి.

మట్టల ఆదివారం



తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో మట్టలతో ఊరేగింపు

ఏసుక్రీస్తు జెరూసలేములోని ఆలయ ప్రవేశాన్ని గుర్తుగా క్రైస్తవులు జరుపుకునే మట్టల ఆదివారం వేడుకలను జిల్లాలో పలు చర్చిలలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం ఆరాధన సమయం కంటే ముందే వివిధ చర్చిలలో విశ్వాసులు, భక్తులు పువ్వులతో అలంకరించిన తాటి, కొబ్బరి, ఈత ఆకులను చేతబట్టి కీర్తనలు పాడుకుంటూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఊరేగింపుగా ఆయా చర్చిలకు చేరుకుని ప్రార్థనలలో పాల్గొన్నారు.



బాణసంచా తయారీ..

భద్రత లేదు

- కనీస ప్రమాణాలు పాటించని వ్యాపారులు
- కూలీల ప్రాణాలకు ముప్పు
- పట్టించుకోని అధికారులు

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

పోలసానిపల్లిలో దళిత సంఘాల నిరసన

7

మార్మోగిన గోవింద నామస్మరణ | జై.. గుబ్బల మంగమ్మ తల్లీ..

భక్తులతో కళకళలాడిన వెంకన్న, గుబ్బల మంగమ్మ ఆలయాలు


క్యూలైన్లలో భక్తులు

గోవిందుని నామస్మరణతో శ్రీవారి క్షేత్రం మార్మోగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తజనులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు 12 వేల మంది వరకు స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనానంతరం భక్తులు ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

\- ద్వారకాతిరుమల

వనదేవత శ్రీగుబ్బల మంగమ్మను దర్శించుకోవడానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను చేశారు. వరుసగా గతంలో ఆదివారం రోజున పండుగలు రావడంతో ఈ వారం సుమారు ఆరు వేల మంది భక్తులు వచ్చారని అధికారులు అంచనా వేస్తున్నారు.

\- బుట్టాయగూడెం


ఆలయం వద్ద భక్తులు

సరిపల్లి క్రికెటర్‌కు భలే ఛాన్స్

» ఇండియా తరపున నేపాల్‌లో ఆడే అవకాశం

» విశాఖ ప్రైవేట్ స్పోర్ట్స్ క్రికెట్ అసోసియేషన్ ఎంపిక


క్రికెట్ కప్పుతో మాధుర్

నరసాపురం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : సరిపల్లి గ్రామానికి చెందిన వెలిగట్ల శ్రీవెంకట నాగ మాధుర్‌కు భారత్ తరపున నేపాల్‌లో ఆడే అవకాశం దక్కింది. అండర్-19 క్రికెట్ జట్టును విశాఖకు చెందిన ప్రైవేట్ స్పోర్ట్స్ క్లబ్ నాన్‌సైయిడ్ క్రికెట్ అసోసియేషన్ ఎంపిక చేసింది. 15 మందితో కూడిన జట్టులో మాధుర్‌కు స్థానం దక్కింది. ఈనెల 26 నుంచి మే 31 వరకు నేపాల్‌లో జరిగే ఇంటర్నేషన్ ఇండో- నేపాల్ సిరీస్‌లో ఏపీ తరఫున ఆడనున్నారు. ప్రస్తుతం నరసాపురంలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న యువకుడు ఇప్పటివరకు మూడుసార్లు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-16, 18 జట్ల తరపున పోటీల్లో పాల్గొన్నాడు. తల్లి ఆదిలక్ష్మి గృహిణి కాగా, తండ్రి బాలాజీ చిన్నపిల్లలకు క్రికెట్ కోచ్‌గా పనిచేస్తున్నారు.

ఇండియా టీమ్‌లో ఆడడమే లక్ష్యం

యువకుడు స్పందిస్తూ ఈ అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. అక్కడ మెరుగైన ఆటతీరు కనబరిస్తే రాష్ట్ర జట్టు, రంజీల్లో స్థానం వస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని క్రికెట్‌లో రాణించేందుకు ప్రయత్నిస్తా. తన క్రీడాభివృద్ధికి నా తండ్రి బాలాజీ, ప్రిన్సిపాల్ రాజన్ ప్రోత్సాహం ఉంది. ఎప్పటికైనా ఇండియా టీమ్‌లో ఆడాలన్నదే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా జైన్ యూత్ క్రికెట్ క్లబ్, నరసాపురం యూత్ క్రికెట్ క్లబ్‌తో పాటు పలు క్రికెట్ అసోసియేషన్లు ఆదివారం అభినందించాయి.


ఉత్తమ ఫలితాలు సాధించిన తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం

తణుకు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తణుకులోని తిరుమల జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470కి466 మార్కులు తొమ్మిది మంది విద్యార్థులు వి.ఆర్. అభినయ, డి.శ్రీవల్లి, బి.ఎల్.సాయికుసుమ, ఎస్.లావణ్య, జె.లలితా దేవి, సీహెచ్.వి.సాయి ప్రజ్ఞ, డి.జి.వి దుర్గామల్లిక, పి.ఎల్.కె.సాయి సౌమ్య, కె.నాగ గాయత్రి సాధించారని 465 పైన 23 మంది, 460పైన 98 మంది, 450పైన 188 మంది, 400పైన 285 మంది విద్యార్థులు సాధించి, 99.5శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 440కి 435 మార్కులు ఎం.సజ్మఆర్వా సాధించారని, 434 మార్కులు డి.అశ్రిత శ్రీదుర్గ, 430పైన 14మంది, 400పైన 25మంది విద్యార్థులు సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ తిరుమలరావు అభినందించారు. కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ కె.దుర్గాప్రసాదు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర

పీఆర్ డిప్లొమా ఇంజనీర్లపై కేసులు ఉపసంహరించాలి

ఏలూరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పీఆర్ డిప్లొమా ఇంజనీర్లపై గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు దిగిందని ఎంజీఎన్ ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ పనులపై విజిలెన్స్ నివేదికలు తయారుచేసి కేసులు పెట్టి ఉపసంహరించుకుందని, ఇంకా మిగిలిన ఎనిమిది జిల్లాల ఇంజనీర్లపై కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర కోరారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ అధ్యక్షతన సంఘ రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018-19లో చేపట్టిన 25వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించగా వైసీపీ ప్రభుత్వం చేసిన పనులకు చెల్లింపులు ఆపాలనే ఉద్దేశంతో విజిలెన్స్ కేసులు బనాయించిందన్నారు. చేసిన పనులపై ఏసీబీ శాఖతో విచారణ చేసి ఇంజనీర్లపై కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం ఎనిమిది జిల్లాల ఇంజనీర్లపై కేసులు ఉపసంహరిస్తామని మంత్రి పవన్‌కల్యాణ్ కేసులు ఎత్తేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం కార్యదర్శి జి.వెంకటరెడ్డి మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాలాజీ బోసుబాబు, బి.శ్రీనివాసమూర్తి, ఎ.రాంబాబు, ఎ.చంద్రునాయుడు, విజయకుమార్, పి.శ్రీనివాసరావు, పలు జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కూల్‌కూల్‌గా ప్రయాణం

చాట్రాయి : చాట్రాయి మండలం చిత్తపూరు- కొండపర్వ గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు బాగా పెరిగి చివర్లు కలిసిపోయి గొడుగుల్లా తయారయ్యాయి. సుమారు అర కిలోమీటరు దూరం వున్న ఈ రహదారిలోనే చాట్రాయి మండల ప్రజలు నూజివీడు, విజయవాడ వెళ్తుంటారు. వేసవి కాలంలో ద్విచక్రవాహనాలు, కార్లలో ప్రయాణించేవారు కొద్దిసేపు ఇక్కడ ఆగి సేదతీరి వెళుతున్నారు.


చిత్తపూరు-కొండపర్వ మధ్య రహదారికి ఇరువైపులా చెట్లు

అత్తిలి కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అత్తిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం గుమ్మంపాడు, బల్లిపాడు గ్రామ శివారు కాలువలో కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహంపై దుస్తులు లేక పోవడంతో కాలువలోకి స్నానానికి దిగి మృతి చెందాడా లేక ఏవిధంగా చనిపోయాడనేది తెలియాల్సి ఉంది. సుమారు 60 ఏళ్ల వయస్సు, చామన చాయ రంగుతో ఉన్నాడు. అత్తిలి పోలీసులు మృతదేహన్ని బయటకు తీయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కనీస వసతులు, భద్రత లేమితో బాణసంచా తయారీ, దుకాణాలు, గోదాముల్లో కూలీల ప్రాణాలు గాలిలో దీపంలా మారిపోతున్నాయి. పొట్టకూటి కోసం పనికి వెళ్తున్న కూలీల ప్రాణాలకు కనీస బీమా లేకపోవడంతో వందలాది మంది కూలీల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తాజాగా అనకాపల్లి జిల్లాలోని కైలాస పట్నంలో ఎనిమిది మంది కూలీలు బాణ సంచా దుకాణం వద్ద అగ్ని ప్రమా దంతో ప్రాణాలు వదిలిన ఘటనతో పశ్చిమ గోదావరి జిల్లాలోని బాణాసంచా ప్రమాద ప్రభావిత కుటుంబాలు ఉలిక్కి పడ్డాయి. జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, దుకాణాల వద్ద వసతులు కల్పించకపోవడంపై ఆంధ్రజ్యోతి కథనం.

తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో రెండేళ్ల క్రితం బాణసంచా తయారీ కేంద్రం వద్ద గంధకం వాడకం వద్ద ఎక్కువ కావడంతో ఒక్కసారిగా విస్ఫోటనం రావడంతో భారీ పేలుడు సంభ వించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు తునాతునకలై తల ఒక చోట, చేతులు ఇంకోచోట చెల్లా చెదురుగా పడి మృతి చెందారు. వారి శరీర అవయవాలు వెతుక్కుని తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తణుకు మండలం దువ్వ వద్ద చిచ్చుబుడ్ల రాపిడి వల్ల నిప్పు రవ్వలు ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన భార్య భర్తలు మృతి చెందగా ఆ కుటుంబం నిరాదరణకు గురైంది.



బాణసంచా కేంద్రాల్లో భద్రత కరువు !

» కూలీల ప్రాణాలకు ముప్పు

» పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :

బాణసంచా దుకాణాలు, తయారీ కేంద్రాలు, గోదాముల వద్ద ఉండాల్సిన కనీస సదుపాయాలు లేక ప్రమాదాల బారిన పడుతున్నాయి. కనీసం విద్యుత్ సరఫరా కూడా ఉండకూడదనే నిబంధన ఉన్నా దాన్ని అంతా బేఖాతరు చేస్తుంటారు. దానికి తోడు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ప్రమాద తీవ్రతను తగ్గించే పరికరాలు తూతూమంత్రంగా ఏర్పాటు చేయడం, ప్రమాదం సంభవించినప్పుడు ఏం చేయాలో సిబ్బందికి కనీస అవగాహన ఉండదనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తూ తరచూ సంభవించే అగ్ని ప్రమాదాల వల్ల పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జిల్లాలో చాలానే జరిగాయి.

కూలీలకు బీమా కరువే..

బాణసంచా దుకాణాల వద్ద నిప్పుతో చెలగాటం ఆడాలని కూలీలకు తెలిసినా పొట్టకూటి కోసం తెగించి పనులు చేస్తుంటారు. కూలీలకు కనీసం బీమా కట్టకుండా గాలికి వదిలేస్తుండటం బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు నిబద్ధతకు అద్దం పడుతోంది. అధికారులైనా తప్పనిసరిగా ప్రమాద నివారణ ఎక్విప్‌మెంట్ నిబంధనలు పాటించాల్సిన బాధ్యత తీసుకునేలా జాగ్రత్తలు పాటించాలి. కూలీలకు బీమా సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

కనీస ప్రమాణాలు పాటించని వ్యాపారులు

జిల్లాలో అనుమతి ఇవ్వకున్నా..

గతేడాది దీపావళికి బాణసంచా తయారీ కేంద్రాలకు పశ్చిమ గోదావరి జిల్లాలో లైసెన్స్‌లు ఇవ్వకపోవడంతో వ్యాపారులు సరిహద్దు రాజకీయాలు చేసి మరీ వ్యాపారాలు సాగించారు. పశ్చిమ గోదావరి జిల్లా దువ్వ సమీపంలోని తూర్పుగోదావరి జిల్లా సూర్యారావుపాలెం వద్ద బాణసంచా తయారీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఆ కేంద్రం వద్ద అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు మృతి చెందడం చర్చనీయాంశమైంది.

పేలుడు ఘటనలు ఇలా..

బాణసంచా తయారీ కేంద్రాల్లోనే ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగాయి. అత్యంత భయంకరంగా ఉంగుటూరు మండలం వెల్లమిల్లి ఘటనలో పటాసుల తయారీలో గంధకం వాడకం ఎక్కువగా ఉండడంతో పేలుడు సంభవించి ఏకంగా ఎనిమిది మంది మృతి చెందగా పదుల సంఖ్యలో గాయాల పాలయ్యారు. అప్పట్లో ఈ ఘటన ఓ సంచలనం. ఆ తరువాత తాడేపల్లిగూడెం పడాలలో మరో ఘటనలో ఓ కూలీ మృతి చెందగా, తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో జరిగిన అగ్నిప్రమాదంలో గంధకం వాడకం ఎక్కువగా ఉండడంతో చిచ్చుబుడ్ల తయారీలో నిప్పుకనికలు ఏర్పడి ముగ్గురు కూలీలను బలితీసుకున్నాయి. దువ్వలో బాణసంచా తయారీ కేంద్రంలో ముగ్గురు, కానూరులో సీమటపాకాయల పేలుడు ఘటనలో ముగ్గురు, గతేడాది దువ్వ సమీపంలోని తూర్పు గోదావరి జిల్లా సూర్యారావుపాలెం వద్ద దీపావళి ముందు బాణసంచా దుకాణం వద్ద పిడుగుపడి ముగ్గురు కూలీలు మృతి చెందిన ఘటనలు అన్నీ నిర్లక్ష్యం వల్లే జరిగాయనడానికి నిదర్శనం.

అన్నింటా అప్రమత్తత అవసరం

ఈ అగ్నిప్రమాదాల నివారణకు అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో బాణసంచా వ్యాపారాలు ఎక్కువ. ఆయా ప్రాంతాల్లో దుకాణాల వద్ద భద్రత ప్రమాణాలు నూరుశాతం అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. కొత్తగా బాణసంచా గోదాములు, తయారీ కేంద్రాలకు అనుమతి ఇచ్చేప్పుడు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

భీమడోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పోలసానపల్లి గ్రామంలో ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘోర అవమానం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడంతో దళిత సంఘాలు మండిపడ్డాయి. సోమవారం అంబేడ్కర్ జయంతి జరుగనున్న నేపథ్యంలో పోలసానపల్లి రహదారి పక్కనే కొత్త విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. దీనిపై గుర్తుతెలియని వ్యక్తులు చెప్పుల దండ వేయడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో సీఐ విల్సన్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్‌తో దర్యాప్తును వేగవంతం చేశారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే విగ్రహానికి అవమానం జరగడాన్ని పలు దళిత సంఘాలు ఖండించాయి. రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించాయి. నిందితులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. దళిత సంఘ నేతలు సంతోష్‌కుమార్‌తో పాటు స్థానిక నేతలు ప్రత్తి మదన్, యుగంధర్, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


పోలసానపల్లి రహదారిపై దళిత సంఘాల నాయకుల ధర్నా

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఓ వ్యక్తి పురుగుల మందుతాగి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు దుగ్గిరాలలోని జోసఫ్ నగర్‌కు చెందిన దాసరి మణిరాజు(44) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల పదో తేదీ సాయంత్రం తన ఇంటి వద్ద పురుగుల మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పంతంగి ఉమాశిరీషా(23) జీఎన్‌ఎం చదివి ఏలూరు రామచంద్రరావుపేటలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. విసన్నపేట మండలం ముత్రాసుపాలెంకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమించాలంటూ ఆమెను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ వేధింపులు తారస్థాయికి చేరడంతో యువతి ఈనెల 11వ తేదీన పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను తల్లిదండ్రులు ధర్మాజీగూడెం ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. ఆదివారం యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. యువతి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దామరచర్లలో వివాదం

» కర్రలతో కొట్టుకున్న ఇరువర్గాలు » ముగ్గురికి తీవ్ర గాయాలు.. కానిస్టేబుల్‌కు చెయ్యి విరిగింది

» పోలీసు పికెట్ ఏర్పాటు.. పర్యవేక్షిస్తున్న పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు


గాయపడిన దుర్గయ్య

కుక్కునూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య తలెత్తిన చిన్న వివాదం పెద్ద కొట్లాటకు దారి తీసింది. ఇరువర్గాలు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు పికెట్ ఏర్పాటు చేయగా పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణ జరిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. శనివారం రాత్రి దామరచర్లలో రహదారి పక్కన ఉన్న ఓ బడ్డీకొట్టు సమీపంలో రెండు సామాజిక వర్గాల యువకుల మధ్య చిన్న గొడవ తలెత్తింది. ఈ క్రమంలో ఒక యువకునిపై దాడి జరిగింది. ఈమేరకు రెండువైపులా ఆయా సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు వచ్చి ఘర్షణ పడ్డారు. అనంతరం కర్రలతో కొట్టుకున్నారు. అనంతరం గ్రామపెద్దలు జోక్యం చేసుకోవడంతో వివాదం సర్దుమనిగింది. ఆదివారం ఉదయం గ్రామంలోని ఒక పెద్దమనిషి దగ్గర ఇరు సామాజిక వర్గాల పెద్దలు రాజీ చేసుకున్నారు.

ఆదివారం మధ్యాహ్నం మరోసారి సమీప గ్రామంలో రెండు సామాజిక వర్గాల వ్యక్తులు తారసపడి పరస్పరం దూషించుకున్నారు. ఈ గ్రా మంలో రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తి పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. పోలీసులు చెల్లాచెదురు చేస్తు న్నప్పటికీ కొట్టుకుంటూనే ఉన్నారు. ఈ దాడిలో ఎస్.ప్రసాద్, దుర్గయ్య, సతీశ్ అనే ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే సమయంలో ముడియం శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ కొట్లాడుకుంటున్నవారిని చెల్లాచెదురు చేస్తూ కింద పడడంతో చెయ్యి విరిగింది. అనంతరం వీరిని ప్రాథమిక చికిత్స నిమిత్తం సమీప అమరవరం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు గ్రామంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, కుక్కునూరు, వేలేరుపాడు పోలీస్ సిబ్బంది గ్రామంలో పర్యవేక్షిస్తూ వేలేరుపాడు పోలీసులు గ్రామంలో పహారా కాస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రాజు

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా శాఖ అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్‌రాజు అన్నారు. ఆదివారం ఏలూరు సంఘ భవనంలో ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పదోన్నతుల విషయంలో పోస్టులు కేటాయించిన తరువాత ఫీడర్ కోటాలు సమావేశం అనంతరం ఏర్పాటు చేసేలా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 35ను ఎటువంటి సమాచారం లేకుండా విడుదల చేయడం జిల్లా, మండల పరిషత్, ఇంజనీరింగ్ డివిజన్‌లో ఏవోల పదోన్నతులతో తీవ్ర అన్యాయం చేసేలా ఉన్న 34శాతం కోటాను ఇచ్చారన్నారు. నూతన సంస్కరణల్లో భాగంగా ఎంపీడీవో పోస్టు నియామకం రద్దు వల్ల కనీసం 50 శాతానికి పెంచకుండా చేయడం సరికాదన్నారు. తక్షణమే జీవోను సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి చుక్కా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పెళ్లైన మూడు నెలల్లోపే..

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

పాలకోడేరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని మూడు నెలలు కాలేదు. ఇద్దరి మధ్య ఏమైందో ఏమోగాని భర్త కాసాని నానిబాబు ఇంటి ముందు భార్య ధర్నా చేసిన సంఘటన ఆదివారం గొల్లలకోడేరు గ్రామంలోని ఒకటో వార్డులో జరిగింది. గొల్లలకోడేరుకు చెందిన కాసాని నానిబాబు పాలకోడేరు గ్రామానికి చెందిన గౌరీ అనే యువతి పాలకోడేరులోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తూ ప్రేమించుకున్నారు. ఆపై గొడవల మధ్య వీరి వివాహం పెద్దల సమక్షంలోనే జరిగింది. వివాహమైన రెండు నెలల తర్వాత నానిబాబు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పాలకోడేరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. కొన్నిరోజుల తర్వాత నానిబాబు ఇంటికి తిరిగి వచ్చేశాడు. అలా వీరి బంధం సాగుతుంది. మళ్లీ ఏమైందో తెలియదుగాని, భార్య గౌరీని నానిబాబు కుటుంబ సభ్యులు పుట్టింటికి పంపించివేయడంతో ఆమె తన భర్త తనకు కావాలంటూ భర్త ఇంటి ముందు కూర్చొని ధర్నా చేసింది. తన భర్తను తన వద్దకు పంపించాలని ఆందోళన చేపట్టింది. దీనిపై పాలకోడేరు పోలీసులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వారు ఎప్పుడూ గొడవలు పడుతూనే ఉంటారని, దీనిపై మిస్సింగ్ కేసు కూడా నమోదైందని, మళ్లీ అతడు తిరిగి వచ్చేశాడని, అయితే ఇంటి ముందు ధర్నా చేసిన విషయం తమ వద్దకు రాలేదని రైటర్ నాగరాజు తెలిపారు.


భర్త ఇంటి ముందు భార్య గౌరి ఆందోళన

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 15న ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ప్రసూతి తదితర స్త్రీ సంబంధ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కె. గాయత్రి ఉచిత వైద్య సేవలు అందిస్తారన్నారు. లాప్రోస్కోపి, అల్ట్రాసౌండ్ స్కానింగ్ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గురుకుల ప్రవేశ పరీక్షలు ఆదివారం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 5వ తరగతిలో ప్రవేశానికి, మధ్యాహ్నం ఇంటర్ ప్రవేశానికి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాలను గురుకులాల జిల్లా సమన్వయకర్త బి ఉమాకుమారి పరిశీలించారు. మొత్తం 206 మందికి 182 పరీక్షలు రాసినట్టు ప్రిన్సిపాల్ బి. రాజారావు తెలిపారు.

పుష్కరాలకు రూ. 18 కోట్లతో ప్రతిపాదనలు

వేములదీవిలో 33 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుమతి

ఆంధ్రజ్యోతితో ఈపీడీసీఎల్ ఈఈ మధుకుమార్



నరసాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణం, గ్రామాల్లో ఎక్కడ చూసినా లో-ఓల్టేజ్ సమస్య. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం లేదు. దీన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గాడిలో పెట్టేందుకు శ్రీకారం చుట్టింది. తొమ్మిది నెలల కాలంలో నరసాపురం ఈపీడీసీఎల్ సబ్‌డివిజన్ పరిధిలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గంలో 154 పైగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. కొత్తగా నరసాపురం మండలం వేములదీవిలో 33 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రానున్న పుష్కరాలకు రూ. 18 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. ఈపీడీసీఎల్ నరసాపురం సబ్ డివిజన్ ఈఈ మధుకుమార్‌తో ఆంధ్రజ్యోతి ముఖాముఖి..

•గోదావరి పుష్కరాలకు ఎన్ని కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు?

రూ. 18 కోట్లతో ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదించాం

•ఏయే ప్రాంతాల్లో పనులు చేపట్టనున్నారు?

నరసాపురం పట్టణం, మండలంలోని తొమ్మిది స్నానాల రేవుల వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు, శిథిలావస్థకు చేరిన స్తంభాల తొలగింపు, విద్యుత్ వైర్ల మార్పు, ఆలయాలు వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ ఫెన్సింగ్ ఏర్పాటు వంటి పనులు ప్రతిపాదించాం.

•సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని స్నానాల రేవులు ఉన్నాయి?

35 రేవులు గుర్తించాం. ఇందులో నరసాపురం పట్టణంలో 8, రూరల్ 5, యలమంచిలి 13, పెనుగొండ 3, ఆచంటలో 5 రేవులు ఉన్నాయి.

• లో-ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు చేపట్టిన చర్యలు?

నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో 154 సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాం. ఇవి కాకుండా పాలకొల్లు రూరల్ ఆగర్తిపాలెం, గ్రామంలో రూ. 54 లక్షలతో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని మరో ఐదుకు పెంచాం. అదే విధంగా యలమంచిలి మండలంలో కాజ, ఆచంటలో కూడా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను మరో ఐదుకు పెంచాం. ఇందుకు రూ 1.70 కోట్లు వెచ్చించాం.

•ఎన్ని గ్రామాలకు మెరుగైన విద్యుత్ అందించగలుగుతున్నారు?

దీని వల్ల 30 గ్రామాల్లో విద్యుత్ నాణ్యత పెరిగింది. లో ఓల్టేజ్ సమస్య చాల వరకు తగ్గింది. అవసరమైతే మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల సామార్థ్యాన్ని కూడా పెంచేందుకు సిద్ధంగా ఉన్నాం.

•కొత్తగా సబ్ స్టేషన్ నిర్మాణ ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా?

నరసాపురం మండలం వేములదీవిలో సుమారు రూ. 33 కోట్లతో 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నాం. స్థల సేకరణ పూర్తయింది. నిర్మాణం పూర్తయితే రాజుల్లంక, చినలంక, దర్బరేవు, పీఎంలంక, సారవ గ్రామాలకు మెరుగైన విద్యుత్ అందనుంది.

•సూర్యఘర్ పథకానికి ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులొచ్చాయి?

సబ్ డివిజన్‌లో ఇప్పటి వరకు 4786 దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల కన్నా... పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ స్పందన ఉంది.

•ఇప్పటి వరకు ఎన్ని గృహాలపై సోలార్ ప్యానల్స్ బిగించారు?

271 గృహాలపై బిగించాం.

•ఎన్ని గృహాలకు సోలార్ వెలుగులు ఇవ్వాలని లక్ష్యం

30 వేల గృహాలు లక్ష్యం.





అత్తిలిలో ఆరిమిల్లి, ఆచంటలో మోషేన్‌రాజు అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ

అంబేడ్కర్ భావితరాలకు స్ఫూర్తి: ఆరిమిల్లి

అత్తిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :అంబేడ్కర్ ఆలోచనలను భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి చినపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగినప్పుడే ప్రజాస్వామ్యం ఉంటుందని అంబేడ్కర్ ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. అత్తిలి మండల జనసేన అధ్యక్షుడు దాసం ప్రసాద్ అంబేడ్కర్ విగ్రహాన్ని అందించడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు. ఎన్నికల సమయంలో తన దృష్టికి తీసుకువచ్చిన అత్తిలి చినపేటలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఇప్పటికే అధికారులు ఆదేశించినట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ చెప్పారు.

అన్ని వర్గాలకు ఆరాధ్యుడు అంబేడ్కర్: మోషేన్

ఆచంట: అన్ని వర్గాల వారికి ఆరాధ్యుడు నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆచంట సర్పంచ్ కోట సరోజిని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మోషేన్‌రాజు ఆవిష్కరించారు. వైసీపీ నేత చెరుకువాడ నరేష్ రాజు ప్రసంగించారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి

తణుకు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ఆదివారం పట్టణంలోని మున్సిపా లిటీ ఆధ్వర్యంలో పలు ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం : బొలిశెట్టి



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్ర జ్యోతి): ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిం చి అవస రమైతే జాతీయ స్థాయి క్రీడలకు పంపేందుకు తన సహకారం ఉంటుందని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి క్రికెట్ లీగ్ పోటీలను ఆదివారం ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 రోజుల పాటు 44 జట్లు తలపడగా వారిలో ఫైనల్‌కు చేరిన పండు లయన్స్, అజయ్ ఎలెవెన్స్ జట్ల సభ్యులను అభినందించారు. బొలిశెట్టి క్రికెట్ లీగ్ నిర్వాహకులు బొలిశెట్టి రాజేష్, జనసేన నాయకులు పుల్లా బాబి, నీలపాల దినేష్ తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

పాలకోడేరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలం వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సత్కరించారు. పాఠశాలకు బీరువాని, పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు.

ఘనంగా మట్టల ఆదివారం

ఏసును స్తుతిస్తూ క్రైస్తవుల ర్యాలీలు.. చర్చిల్లో ప్రార్థనలు



భీమవరం, పెనుగొండలో మట్టలతో ర్యాలీలు



భీమవరం అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బేతనీ లూథరన్ చర్చిలో ఆదివారం సండే స్కూల్ బాలబాలి కలు మట్టల ఆదివారం పండుగ సందర్భంగా ఈత మట్టలకు రకరకాల పువ్వులు అలకరించి చేత పట్టు కొని పుర విధుల గుండా క్రైస్తవ భక్తి గీతాల పాడు కుంటూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఈ ర్యాలీ లో బేతనీ చర్చ్ పాస్టర్ ఎస్ డేనియల్ పుష్పరాజ్ మాట్లాడుతూ క్రైస్తవులు యేసు క్రీస్తు చూపిన మంచి మార్గాన్ని ఎంచుకొని పయనించాలని ఈ మట్టల ఆదివారాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ర్యాలీలో ఎలిజబేత్ రాణి, సరళ పాల్, టీ వజ్రమ్మ, పీ శ్వేత, ఎన్ నిహారిక, జీ అనితా రాణి, గంటా సుందర్ కుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూ డెం పట్టణం, మండలంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో విశ్వాసులు ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన చర్చిల వద్ద మట్టల ఆదివారం ఘనంగా జరుపుకు న్నారు.

తణుకు/తణుకు రూరల్: మట్టల ఆదివారం వేడుకలను పట్టణం, మండలంలోని పలు చర్చిలలో విశ్వాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పూలతో అలంకరించిన తాటి, కొబ్బరి, ఈత ఆకులను చేతబట్టి కీర్తనలు పాడుకుంటూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించా రు. ఊరేగింపుగా ఆయా చర్చిలకు చేరుకుని ఆదివారం ప్రార్థనల్లో పాల్గొన్నారు. వేల్పూరులో సెయింట్ పాల్స్ చర్చి, తేతలిలోని జీడీఎం, దువ్వలోని రక్షణ సైన్యం చర్చిలతో పాటు వివిధ గ్రామాల్లోని చర్చిలలో మట్టల ఆదివారం వేడుకలను నిర్వహించారు.

నరసాపురం టౌన్: పట్టణ, మండలంలో ఆది వారం క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం సందర్భంగా మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని లూథరన్, బేతస్థ, కృపానివాస్ చర్చిలతో పాటు మండలంలోని సరిపల్లి, లిఖితపూడి, చిట్టవరం, పసలదీవి, కొప్పర్రు, సీతారాంపురం గ్రామాల్లోని ప్రార్థన మందిరాల వద్ద మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు.

పెనుగొండ: మండలంలోని మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెనుగొండలోని రాజుగూడెం సెయింట్ జాన్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పెనుగొండ లో ర్యాలీ నిర్వహించారు. ప్యారిస్ పాస్టర్ క్రిస్టఫర్, సంఘ సీఆర్ ప్రసాద్, సంఘ పెద్దలు, విశ్వాసులు, సండే స్కూలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: మండలంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలకు పలు రకాల పూలను అలంకరించి సండే స్కూల్ పిల్లలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ టి.కొండయ్య, సీఆర్ ఏ లాజర్, పి.పూజిత, సంఘ పెద్దలు కోనాల ప్రసాదరావు, పీసీసీ ఇంజేటి తాతారావు, భోగేశ్వరరావు, మోకా మార్కురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రతి ఈస్టర్ పండుగ ముందు వచ్చే ఆదివారాన్ని మట్టలాదివారం అంటారని పాస్టర్ జోస ఫ్‌రాజు అన్నారు. ఆదివారం మట్టలతో ర్యాలీ నిర్వ హించి మాట్లాడారు.

కారుమూరికి జైలు ఖాయం: మంత్రి వర్మ

యలమంచిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గతంలో రైతులను ఎర్రిపప్ప అన్న ఎర్రిపప్ప మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు చెబుతున్నా కూటమి నాయకుల జోలికొస్తే కాళ్లు, చేతులూ విరగ్గొడతాం అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మండలంలోని ఊటాడ, యలమంచిలి గ్రామాల్లో రూ.3.26 కోట్లతో చేపట్టనున్న రహదారులు, జలజీవన్ మిషన్ రివిట్‌మెంట్ పనులకు ఆయన రాష్ట్ర జల వనరులశాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయు డుతో కలిసి ఆదివారం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం యలమం చిలిలో టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రులు వర్మ, రామానాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ తణుకు మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి త్వరలో జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు ఉచితంగా అందించడమే జలజీవన్ మిషన్ పథకం లక్ష్యమన్నారు. అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రూ.30 కోట్ల 55లక్షల నిధులతో రైతులకు మేలుచేసే రహదారులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గోదావరి వరద ముంపుకు గురి కాకుండా.. రూ.8 కోట్లతో ఏటిగట్లను పటిష్టం చేస్తున్నామని చెప్పారు. సర్పంచ్ బర్రె మేరీ, ఎంపీటీసీ చిలుకూరి రాజ్యలక్ష్మి, కూటమి నాయకులు ఆరుమిల్లి చిన్ని, తాళ్లూరి శ్రీనివాస్, బొప్పన హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు వర్మ, నిమ్మల

కాపు వర్గీయులకు చేయూతనివ్వాలి..

భీమవరంటౌన్: భీమవరంలోని కాపు సామాజిక వర్గంలో ఎందరో సన్నిహితులు ఉన్నారని, ఈ సామా జిక వర్గంలో వెనుకబడిన వారికి ప్రోత్సాహం అందించి విద్య, వైద్య రంగాల్లో చేయూతనిచ్చి ఐక్యతగా సాగాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో కాపు సామాజిక వర్గ ప్రముఖులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన తండ్రి పేరిట ఏర్పాటు చేస్తున్న ట్రస్టు ద్వారా వెనుకబడిన కాపు సామాజిక వర్గ విద్యార్థులకు సహకారం అందిస్తానన్నారు. ఎమ్మె ల్యే అంజిబాబు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబ డిన విద్యార్థులకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందిం చాలన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గోవిందరావు, మన వారి కోసం మనం అధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు చినిమిల్లి వెంకట రాయుడు, ఉపాధ్యక్షుడు అడపా బాబ్జితో పాటు పలువురు కాపు ప్రముఖులు పాల్గొ న్నారు. మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు, చినబా బును, ఇటీవల ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన డాక్టర్ చుండూరు మల్లీశ్వరిని మన వారి కోసం మనం సభ్యులు ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి అగ్నిమాపక శాఖ అవగాహన వారోత్సవాలు

భీమవరం క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర వి పత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు అవగాహన వారోత్స వాలు నిర్వహించనున్నట్లు జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. 'అగ్ని సురక్షిత భారత దేశానికై ఐక్యమవ్వండి' నినాదంతో వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. ప్ర తిరోజు అవగాహన కార్యక్రమాలు, మాక్ డ్రిల్, సద స్సులు నిర్వహిస్తామన్నారు. అగ్ని మాపక శాఖలో విశి ష్ట సేవలందిస్తూ ప్రా ణాలు కోల్పోయిన అమరవీరుల ను స్మరించుకుంటూ మృతవీరుల సంస్మరణ దినోత్స వాన్ని సోమవారం నిర్వహిస్తామన్నారు. అగ్నిమాపక పరికరాలు, అగ్నిమాపక వాహనాల పనితీరు, ముందు జాగ్రత్త చర్య లపై అవగాహన కల్పిస్తామన్నారు.



రక్తదానం

మొగల్తూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక టీఆర్‌కె కార్ బజార్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిం చారు. రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది నుంచి రక్తం సేకరించారు. ట్రస్ట్ నిర్వాహకులు తణుకుల రామకృష్ణ, నల్లి నాగరాజు, ఆకన పణీంద్రనాథ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వివేకా రాంబాబు, వర్ధనపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న రఘురామ

బాధితులకు అండగా కూటమి

ఆకివీడు/కాళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పేద ప్ర జలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉం డేది కూటమి ప్రభుత్వమని డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం తన కార్యాల యంలో స్థానిక 13వ వార్డు జనసేన ఇన్‌ఛార్జీ కరణం సుందరయ్య తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభా వతికి సీఎంఆర్ఎ ఫ్‌లో భాగంగా వైద్యఖర్చు నిమిత్తం రూ.1,40,000లు చెక్కును అందచేసి మాట్లాడారు. కాళ్ళ మండలం పెదఅమిరంలోని ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడు తున్న 28 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం 11వ విడత 'ముఖ్యమంత్రి సహాయనిధి' నుండి మంజూరైన రూ. 17,87,236/- సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం లబ్ధి దారులకు అందించారు.

మండల్‌కు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం సంఘ కార్యాలయం వద్ద బీపీ మండల్ ఫ్లెక్సీకి పట్టణంలోని బీసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జాతీ య బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ముద్దాడ గణేష్ భవానీ ముఖ్యఅతిథిగా పాల్గొని మండల్ సేవల ను కొనియాడారు. బీరక ప్రసాద్, కర్నేన గౌరు నాయుడు, పొన్న మండ ముత్యాలరావు, కొరుకొండ సుబ్బారావు, నీలంశెట్టి సత్య ప్రసాద్, డి రాంబాబు, కె సంతోషిణి, పి మాధవ నారాయణ, వి శ్రీనివాసరావు, కె భాను ప్రకాష్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా వృద్ధులకు సంచార శకటం ద్వారా ఆదివారం వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకులో పర్యటిం చి నలుగురికి వైద్య సేవలందించారు. సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందించారు. సంఘ కోశాధికారి అర్ధి భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మందాలమ్మ ఆలయానికి విరాళం

పెనుగొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం వడలి గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఉప్పలపాటి స్వామి కుమారుడు జనార్దనరావు జ్ఞాపకార్థం మనుమడు ఉప్పలపాటి చాణక్యం వర ప్రసాద్ స్వామి, కుటుంబ సభ్యులు 70 వేల 999 రూపాయలు విరాళం కమిటీ సభ్యులకు అందించారు.

సంఘ అభివృద్ధికి గున్నేశ్వరరావు విరాళం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక గాయత్రి స్మార్త పురోహిత సంఘ అభివృద్ధి నిమిత్తం పట్టణ ప్రముఖుడు దాత కలగ వెంకట సూర్య సత్య సుబ్రహ్మణ్య గున్నేశ్వరరావు విరాళం ప్రకటించారు. ఇటీవల పురోహిత సంఘం వార్షికోత్సవ సందర్భంగా గున్నేశ్వరరావును మంత్రి రామానాయుడు మీదుగా సత్కరించారు. ఈసందర్భంగా పురోహిత సంఘ అభివృద్ధికి తన వంతుగా ప్రతీ ఏటా రూ. 20 వేలు చొప్పన 5ఏళ్ళు పాటు లక్ష రూపాయలు అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆదివారం సంఘ నాయకులకు రూ.20వేలు తొలి విడతగా సంఘ నాయకులు నుదురుపాటి శ్రీనివాస్, తనికెళ్ళ శ్రీనివాస్, ఈరంకి కాశి తదితరులకు అందజేసారు. ఈసందర్భంగా నాయకులు గున్నేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులకు జలకళ

మొగల్తూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రధాన కాలువలు మూసివేయనున్నందున గ్రామాల్లోని చెరువులను నింపుతున్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలో పంచాయతీ ఆధ్వర్యంలో గల సుమారు 9 గ్రామాలకు సంబంధించిన చెరువులు, రామన్నపాలెం, కెపిపాలెం, పేరుపాలెం, మోడి, వారతిప్ప, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో గల గ్రామస్తులు, గ్రామంలోని పశువుల తాగునీటికి, రజకులు వినియోగించే చెరువులను ప్రత్యేక ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు. మరికొద్ది రోజుల్లో కాలువలు కట్టివేస్తున్నందున వేసవిలో ఏ గ్రామంలోనూ చెరువుల్లో నీటి కొరత లేకుండా పూర్తిస్థాయిలో నీటితో నింపుతున్నామని, మొగల్తూరు, కెపిపాలెం, కోమటితిప్ప బహుత్తర మంచినీటి ప్రాజెక్టు చెరువులను, శేరేపాలెం, కొత్తపాలెం రక్షిత మంచినీటి చెరువులను ప్రత్యేక ఇంజన్లు ఏర్పాటు చేసి నింపుతున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలిపారు.

'భూమన'పై క్రిమినల్ చర్యలు చేపట్టాలి

అసత్య ప్రచారంపై కూటమి నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న వలవల బాబ్జి

అధికారం పోయినా బుద్ధి మారలేదు : ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో ఆవులు చనిపోయాయని అసత్య ప్రచారం చేసిన వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డిపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన భూమన అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అన్యమత ప్రచారం, అనర్హులకు భూములు కేటాయించారని ఆరోపణలున్నా యన్నారు. వైసీపీ నాయకులు మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: వలవల

తాడేపల్లిగూడెం అర్బన్: టీటీడీ గోశాలలో ఆవుల ను చంపేస్తున్నారని హిందువుల మనోభావాలు దెబ్బ తినేలా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షతన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంటనే కరుణాకర్‌రెడ్డిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, దాట్ల జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు : రామరాజు

నరసాపురం టౌన్: టీటీడీ గోశాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేస్తున్న ప్రచారాలని టీడీపీ ఇన్‌చార్జి రామరాజు ఖండించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో తిరుమలలో ఏం జరిగిందో భక్తులందరికీ తెలుసునన్నారు. వీటిని కప్పిపుచ్చుకోవడం కోసమే గోవులు మృతి చెందినట్లు అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, పాలూరి బాబ్జీ, పొన్నాల నాగబాబు, అధికారి అనంతరామారావు, పద్మ, చిన్నాయమ్మ, నాగమణి, షేక్ హుసేన్‌లు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానాలి: పితాని

ఆచంట: భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారాలు మానుకోవాలని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హితవు పలికారు. ఆచంటలో ఆదివారం పార్టీ కార్యాలయం నుంచి ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసారు గోశాలలో 100 ఆవులు చనిపోయాయని కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి నిరాధారమని, పితాని వివరించారు. గోశాలలో గడచిన మూడు నెలల్లో వృద్ధాప్యం కారణంగా 40 ఆవులు మరణించినట్టు పితాని వివ రించారు. టీటీడీ గోశాలలో 260 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవులను సంరక్షిస్తుంటే టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేస్తు న్నారని పేర్కొన్నారు. అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు పోలీసులు పరిశీలించాలని పితాని విజ్ఞప్తి చేశారు.

అసత్య ఆరోపణలు తగవు: గన్ని

గణపవరం: టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు తగదని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గణపవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

కాళ్ళ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మానవత సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో బొండాడ గ్రామంలో కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. మార్చి 26న గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 20 మందికి ఆపరేషన్ చేయించడంతోపాటు 78 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించామని సంస్థ చైర్మన్ బుద్దరా జు వెంకటపతిరాజు తెలిపారు. సంస్థ అధ్యక్షులు పె న్మెత్స రామ్మోహన్ వర్మ మాట్లాడుతూ పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి వైద్యం అందించామన్నారు. కారు మూరి నరసింహమూర్తి, గ్రంధి కుమార వెంకటేశ్వరప్ర సాద్, వడ్డి వెంకటేశ్వరరావు, పి. రంగరాజు పాల్గొన్నారు.

భగవద్గీత అందరూ నేర్వాలి : కలెక్టర్

భీమవరంటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భగవద్గీత నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ చద లవాడ నాగరాణి అన్నారు. ఉద్దరాజు ఆనందరాజు వ ర్ధంతి సందర్భంగా ఆనందా ఫంక్షన్ హాల్‌లో ఆదివా రం సాయంత్రం నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. భగవద్గీత చదవటం వల్లను ఎన్నోతెలి యని విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. తిరుపతి సంస్కృత యూనివర్శిటీ ప్రొఫెసర్ కుప్పా విశ్వనాథ శర్మ ముఖ్యవక్తగా మాట్లాడుతూ భగవద్గీత చదవ టం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు భగవద్గీత అందరికీ రావాలని అందుకే ప్రముఖ గాయకుడు శంకరమహదేవన్ తో సులభతరమైన ట్యూన్స్‌తో రికా ర్డు చేశామని వివరించారు. త్వరలో ప్రముఖుల సమక్షంలో సీడీని ఆవిష్కరించనున్నామన్నారు. ఇంకా కంతేటి వెంకట్రాజు, చంద్రజీ, పైడిరాజు, ప్రభావతి, అమృత వల్లీ, రఘుపతిరాజు, రమాదేవీ, పవన్ కు మార్, డాక్టర్ కృష్ణంరాజు, వబిలిశెట్టికనకరాజు, స త్యనారాయణరాజు పాల్గొన్నారు. అతిథులను సత్క రించారు. ఇటీవల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతులు, స ర్టిఫికెట్లు అందించారు.

ఆధ్యాత్మికం

ముగిసిన యల్లారమ్మ జాతర

తణుకు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం మండపాకలోని యల్లారమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండ పాక, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

అత్తిలి: అత్తిలి మండలం పడవల రేవు వద్ద నిర్మించిన విజయ చాముండేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆలయ శిఖరంపై బూరెలు పోశారు. అఖండ అన్నసమారాధన జరిపారు. కోరిపల్లి హరీ దంపతులు పూజలు చేశారు.

వైభవంగా మావూరమ్మ జాతర

పాలకొల్లు అర్బన్: స్థానిక బంగారు వారి చెరువు గట్టున గల మావూరమ్మ వారి జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి జాతర ప్రారంభించారు. తీన్‌మార్, భేతాళ నృత్యాలు, బుట్ట బొమ్మలు, కోర గేదెలు, బ్యాండ్ మేళం, బాణా సంచా కాల్పులతో జాతర అత్యంత భారీగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శంకరాపు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

మే 4 నుంచి బండి ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే జాతరపై పెద్దలు, మాజీ చైర్మన్‌లు, పాలకవర్గ మాజీ సభ్యులు ఆదివారం ఆలయం వద్ద సమావేశమై కార్యక్రమాలను నిర్ణయించారు. మే4న అమ్మవారిని నిలబెట్టడం, మే7న కరణం కుటుంబీకులచే అఖండ జ్యోతి ప్రజ్వలన, మే 8 నుండి జూన్ 8వ తేదీ వరకూ అమ్మవారిని ఊరేగిస్తారు. మే 25 నుంచి 15 రోజుల పాటు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చేందుకు జూన్ 9న జాతర మహోత్సవాన్ని నిర్వహించేందుకు జూన్ 14న అన్న సమారాధన నిర్వహించేందుకు నిర్ణయించారు.

ఉండి: ఉండిలో పోలేరమ్మ, మహంకాళమ్మ, వెంకమ్మ, పోతురాజు జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 19వతేది వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ చిక్కాల సత్యజగదీష్‌ప్రసాద్, ఉత్సవ కమిటి చైర్మన్ అడబాల బాబూరావు తెలిపారు.

21 నుంచి బ్రహ్మోత్సవాలు

భీమవరంటౌన్: హౌసింగ్ బోర్డు కాలనీ లోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి జరుగుతాయని, కళ్యాణం, రథోత్స వం, వైభవోత్సవం, ఊరేగింపు, ప్రతిరోజూ ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తామని మందిర అధ్యక్షుడు కంతేటి వెంకట రాజు తెలిపారు. ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.